పశువుల చెంతకే వైద్యం

- డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవతో సత్ఫలితాలు
- ఏడు నెలలుగా పల్లెల్లోకి పశువైద్య సేవలు
- పశువైద్యంతో పాటు, పశుసంరక్షణపై అవగాహన

కంకిపాడు: వ్యవసాయ అనుబంధ పరిశ్రమ అయిన పశుపోషణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. పశువులకు చిన్న ఆరోగ్య సమస్య తలెత్తినా వైద్యం చేయించేందుకు పశుపోషకులు గతంలో అష్టకష్టాలు పడ్డారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పశువైద్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. సాధారణ వైద్య సేవలు పశుపోషకుల ఇళ్ల వద్దకే వెళ్లి అందించేలా చర్యలు తీసుకుంది. ఇందుకు డాక్టర్ వైఎస్సార్ పశు ఆరోగ్య సేవ సంచార వాహనాలను అందుబాటులోకి తెచ్చింది. సంచార వైద్యసేవ వాహనాలతో పశుపోషకులకు మెరుగైన సేవలు అందుతున్నాయి.

కంకిపాడు యార్డు కేంద్రంగా..

సంచార ఆరోగ్య సేవ వాహనాన్ని కంకిపాడు, పెనమలూరు మండలాలకు ఒక వాహనం కేటాయించారు. ఈ వాహనం కంకిపాడు మార్కెట్ యార్డులో నిత్యం అందుబాటులో ఉంటుంది. గడిచిన ఏడు నెలలుగా ఈ వాహనం ద్వారా కంకిపాడు, పెనమలూరు మండలాల్లో ఉన్న పశువులు, జీవాలకు వైద్య సహాయం అందుతోంది. పశువైద్యులు, పారావిట్, పైలెట్ చొప్పున మొత్తం ముగ్గురు సిబ్బంది విధుల్లో ఉంటున్నారు.



కంకిపాడు మార్కెట్‌యార్డులో డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్యసేవ వాహనం

1962 హెల్ప్‌లైన్..

పశువులు, జీవాలకు అవసరమైన వైద్య సహాయం కోసం ప్రభుత్వం 1962 హెల్ప్‌లైన్ నంబరును అందుబాటులో ఉంచింది. ఏడు నెలల కాలంలో ఈ రెండు మండలాల్లో ఉన్న 1150 పశువులు, జీవాలకు వైద్య సహాయం అందింది. అత్యవసర వైద్య సేవలకు ఉన్నతాధికారుల అనుమతిలో గన్నవరంలోని ప్రధాన ఆసుపత్రికి తరలిస్తున్నారు. కడుపు ఉబ్బరం, గాలికుంటు, విరేచనాలు, జ్వరం, కాల్షియం లోపాలతో పాల దిగుబడి తగ్గుదల, పొదుగు వాపు వంటి ప్రధాన సమస్యలతో బాధపడుతున్న పశువులు, జీవాలకు వైద్యం అందిస్తున్నారు. పశుపోషకులు ఫోన్ చేసిన అర్ధగంట వ్యవధిలో ఆ ప్రాంతానికి చేరుకుని వైద్యం అందేలా సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు.

వైద్యసేవలు వినియోగించుకోవాలి



ప్రభుత్వం మంచి ఉద్దేశంతో సంచార వైద్యసేవను అందుబాటులోకి తెచ్చింది. ఇంటి వద్దకే వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నాం. 1962 హెల్ప్‌లైన్ నంబరుకు ఫోన్ చేసి వైద్య సేవలు పొందాలి. అవసరమైన మందులు కూడా అందుబాటులో ఉన్నాయి. వైద్య సేవలు సద్వినియోగం చేసుకుని జీవాలు, పశువుల పోషణలో లాభాలను ఆర్జించాలి.

–డాక్టర్ జి.సుకన్య, పశువైద్యురాలు

వ్యాధులపై అవగాహన..

కేవలం వైద్య సహాయంతో పాటుగా వ్యాధులుపై సిబ్బంది పశుపోషకులు, జీవాల పోషకులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇటీవల చలివేంద్రపాలెం, కానూరు గ్రామాల్లో పశువులకు లంపి స్కిన్ వ్యాధి సోకినట్లు గుర్తించి సకాలంలో వైద్యం అందించారు. సీజనల్ వ్యాధులు, అంటువ్యాధులు పట్ల పోషకులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరిస్తూ చైతన్యం నింపుతున్నారు.

క్లుప్తంగా

నీటి నమూనాల సేకరణ

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు, ప్రసాదంపాడు గ్రామాల్లో శుక్రవారం అధికారులు నీటి నమూనాలను సేకరించారు. ప్రసాదంపాడు ఎస్సీ కాలనీలోని వాటర్ ట్యాంకు, పలు మోటారు బోర్ల నుంచి తాగునీటి నమూనాలను సేకరించి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు నివేదిక పంపించారు. ఈ సందర్భంగా ప్రసాదంపాడు పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి నాణ్యత పరీక్ష నిమిత్తం నమూనాలను సేకరించినట్లు తెలిపారు. గ్రామంలో ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి కనెక్షన్ ఇస్తున్నామన్నారు. తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

461 మందికి వైద్య పరీక్షలు



నున్న(విజయవాడరూరల్): జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రభుత్వం ప్రజలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందిస్తున్నామని నున్న ఆరోగ్య కేంద్రం డాక్టర్ నిరంజన్ తెలిపారు. శుక్రవారం నున్న గ్రామ సచివాలయం-2 వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం జరిగింది. ఈ సందర్భంగా రోగులను ఉద్దేశించి డాక్టర్ నిరంజన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల వరకు ఉచితంగా కార్పొరేట్ వైద్యసేవలను అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్య శిబిరంలో డాక్టర్లు విజయ, దీప్తి, అనిత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. 461 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ కార్యదర్శి జీటీవీ రమణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి బైక్ చోరీ

పెనమలూరు: కానూరు ఇంజినీరింగ్ కాలేజీలో చదువుతున్న విద్యార్థి బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేయటంతో శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..విజయవాడ పాయకాపురానికి చెందిన కె.అజయ్ నాగ కృష్ణ కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ 3వ సంవత్సరం చదువుతున్నాడు. అతను ఈ నెల 9వ తేదీన తన బైక్‌ను కాలేజీ వద్ద పార్కు చేసి తరగతులకు వెళ్లాడు. సాయంత్రం తిరిగి వచ్చి చూసుకునే సరికి అతని బైక్ కనిపించలేదు. బైక్ ఆచూకీ కోసం అనేక ప్రాంతాల్లో వెతికాడు. అయినా బైక్ దొరకక పోవటంతో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

హనుమాన్‌జంక్షన్ రూరల్: 2024–25 విద్యా సంవత్సరానికి ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఉచిత ప్రవేశం కల్పించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు బాపులపాడు ఎంఈవో శ్రీరామ్ బాలాసింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీ వర్గాలకు చెందిన పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించాలని చెప్పారు. దీనిలో భాగంగా ఐబీ, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, స్టేట్ సిలబస్ అనుసరిస్తున్న అన్ని ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశం కల్పించేందుకు ఈ నెల 23వ తేదీ నుంచి మార్చి 14వ తేదీ వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతుల్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు శ్రీరామ్ బాలాసింగ్ వివరించారు. ఎంఈవో, డీఈవో, సంబంధిత పాఠశాలల్లో దరఖాస్తుల నిమిత్తం సంప్రదించవచ్చని చెప్పారు. అర్హులైన విద్యార్థులను లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక చేసి సీట్లు కేటాయించనున్నట్లు ఎంఈవో పేర్కొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



హనుమాన్‌జంక్షన్ రూరల్: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బాపులపాడు మండలంలోని పోలింగ్ కేంద్రాలను పోలీసులు శుక్రవారం పరిశీలించారు. హనుమాన్‌జంక్షన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దంటగుంట్ల, కాకులపాడు, తిప్పనగుంట, బాపులపాడు గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలీంగ్ కేంద్రాలను గన్నవరం డీఎస్పీ జయసూర్య, ట్రైనీ డీఎస్పీ వేదశ్రీ ఆధ్వర్యంలో హనుమాన్ జంక్షన్ సీఐ అల్లు నవీన్ నరసింహమూర్తి, ఎస్ఐలు ఏడీఎల్ జనార్ధన్, పి.ఆర్జామ్మలతో కలిసి ఆయన పరిశీలించారు. పోలీంగ్ కేంద్రాలలో ఏర్పాట్లు, వసతి సదుపాయాలు, పరసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు.

కంప్యూటర్ బహూకరణ

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ఏలూరురోడ్డులోని జెడ్పీ హైస్కూల్‌కు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో రూ.80 వేలు విలువ చేసే కంప్యూటర్, ప్రింటర్‌ను బహూకరించారు. హైదరాబాద్‌లో స్థిరపడిన బాపులపాడు మండలం బొమ్ములూరుకు చెందిన నందిగం శ్రీనివాసరావు, గాయత్రి దంపతులు మానవత సంస్థ ద్వారా శుక్రవారం హెచ్‌ఎం తోట పుష్పావతికి వీటిని అందించారు. ఈ కార్యక్రమంలో మానవత కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు, అధ్యక్ష, కార్యదర్శులు కూరెళ్ల సుబ్బాచారి, క్లోపల్లి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటా

దైవసేవలకు ఆత్మీయ సమావేశంలో మంత్రి

పెనమలూరు: నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజాసేవ అందిస్తానని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. పోరంకిలో శుక్రవారం జరిగిన పెనమలూరు నియోజకవర్గ దైవసేవకుల ఆత్మీయ సమావేశంలో ఆయన ప్రసంగించారు. ప్రతి ఒక్కరూ ప్రేమ, దయ, కరుణ క్షమాగుణం కలిగి ఉండాలన్నారు. దైవసేవకులకు రాష్ట్ర ప్రభుత్వ సాయం అందరికీ అందే విధంగా కృషి చేస్తానన్నారు. తాను అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉండి అనుక్షణం సేవలు అందిస్తానని వివరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, దైవసేవకులు పాల్గొన్నారు.

వణుకూరు సమస్యలు పరిష్కరిస్తా

పెనమలూరు: వణుకూరు గ్రామంలో సమస్యలు పరిష్కరిస్తానని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త జోగి రమేష్ అన్నారు. వణుకూరు గ్రామంలో గురువారం రాత్రి సిద్ధం సభ నిర్వహించారు. తొలుత గోసాల నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో మేళతాళాలు, మంగళ హారతులతో మంత్రి జోగి రమేష్‌కు స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలోని బీసీ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన సమావేశంలో మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ పెనమలూరు నియోజకవర్గంతో పాటు వణుకూరు గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలో సమస్యలు తన దృష్టికి తీసుకు వస్తే వెంటనే పరిష్కరిస్తానని తెలిపారు. పార్టీ కోసం కట్టుబడి పని చేస్తున్న యువతకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పార్టీ గెలుపునకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయలన్నారు. ఈ సందర్భంగా పలువురిని కండువా కప్పి పార్టీలోకి మంత్రి ఆహ్వానించారు.



జోగి రమేష్ దంపతులను ఆశీర్వదిస్తున్న దైవసేవకులు

23న శ్రీలక్ష్మీతిరుపతమ్మ వార్షిక కల్యాణం

గన్నవరం: స్థానిక పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో ఈ నెల 23న జరగనున్న అమ్మవారి వార్షిక కల్యాణ మహోత్సవాన్ని భక్తులు జయప్రదం చేయాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ పిలుపు ఇచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఆయన శ్రీలక్ష్మీతిరుపతమ్మ కల్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రికను విడుదల చేశారు. ఈనెల 19న ముత్తైదువులకు గాజుల అలంకరణ, 20న అమ్మవారికి లక్ష పుష్పార్చన, 21న ఉత్సవమూర్తులకు అభిషేకం, కోలాట ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 22న అమ్మవారికి పెండ్లి కుమార్తె అలంకరణ, మహాశాంతి హోమం, మండల దీక్ష ముగింపు, లక్ష కుంకుమార్చన నిర్వహిస్తారు. ఈ నెల 23న రాత్రి 8.10 గంటలకు శ్రీలక్ష్మీతిరుపతమ్మ సమేత గోపయ్యస్వామి కల్యాణ మహోత్సవం జరుగుతుంది. కమిటీ కార్యదర్శి కాసన్నేని వెంకటేశ్వరరావు, కోశాధికారి ఫణిశేఖర్, సభ్యులు ఎం. వేణుగోపాలరావు, చిమట శ్రీనివాసరావు, పోట్ల శివలీల, జాస్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



శ్రీలక్ష్మీతిరుపతమ్మ, గోపయ్యస్వామి ఉత్సవమూర్తులు

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం

జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ జయవర్ధన సురేంద్ర

కంకిపాడు: ఆర్థిక అక్షరాస్యతపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ జయవర్ధన సురేంద్ర అన్నారు. మండలంలోని మంతెన గ్రామంలో ఆర్‌బీఐ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత, సామాజిక భద్రతపై మంతెన గ్రామంలో శుక్రవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. లీడ్ బ్యాంకు మేనేజర్ జయవర్ధన సురేంద్ర మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ఆర్థిక భద్రత, సామాజిక భద్రత రెండూ అవసరమేనన్నారు. బ్యాంకుల ద్వారా అందే పథకాలను సద్వినియోగం చేసుకుని, కుటుంబాలు ఉన్నత స్థితికి చేరుకునేలా తగిన ప్రణాళిక రూపొందించుకుని అమలు చేయాలని పేర్కొన్నారు. ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన వంటి బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజర్ జయమాధురి, ఆర్థిక అక్షరాస్యత కేంద్రాల జిల్లా సమన్వయకర్త కె.శ్రీనివాసరావు, కంకిపాడు కౌన్సిలర్ కైలే సునీల్‌కుమార్, బ్యాంకు అసిస్టెంట్‌మేనేజర్ పి.సాంబశివరావు, కౌన్సిలర్ టి.హేమారావు, స్థానికులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లీడ్ బ్యాంక్ మేనేజర్ జయవర్ధన సురేంద్ర

కూరగాయల మార్కెట్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన



ఏఎంసీ చైర్మన్ తోట కరుణ, వెంకయ్య దంపతులను సత్కరిస్తున్న ప్రజా ప్రతినిధులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక నూజివీడు రోడ్డులోని కూరగాయాల మార్కెట్ యార్డులో రూ.17.50 లక్షల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు గన్నవరం ఏఎంసీ చైర్మన్ తోట కరుణ శుక్రవారం శంకుస్థాపన చేశారు. కూరగాయాల మార్కెట్ యార్డులోని షెడ్లు, ఫ్లాట్‌ఫామ్‌ల మరమ్మతులతో పాటుగా ర్యాంపు నిర్మాణం, ఆర్వో వాటర్ ప్లాంట్, టాయిలెట్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కూరగాయాల మార్కెట్‌లో రైతులు, వ్యాపారులతో ఆమె మాట్లాడి వసతులపై ఆరా తీశారు. స్థానికుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు మార్కెట్ యార్డు ఆవరణలో నూజివీడు రోడ్డు వెంబడి రైతు బజారు తరహా కూరగాయాల షాపులు ఏర్పాటుకు ప్రతిపాదనలు ఉన్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే వంశీమోహన్ దృష్టికి తీసుకువెళ్లి త్వరలో కార్యరూపం దాల్చేలా చూస్తామని చెప్పారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య, పార్టీ మండల అధ్యక్షుడు నక్కా గాంధీ, జేసీఎస్ మండల ఇన్‌చార్జి ఆవిర్నేని శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, సర్పంచ్ సరిపల్లి కమలాభాయి, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్‌మూర్తి, ఏఎంసీ డైరెక్టర్లు పసుపులేటి మురళీ, గండేపూడి రాణి, పీఏసీఎస్ మాజీ చైర్మన్లు యర్రంశెట్టి రామాంజనేయులు, గూడవల్లి రత్న సుధాకర్ పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు

ఉయ్యూరు: మైనర్లు వాహనాలు నడిపితే ఉపేక్షించేది లేదని పట్టణ ఎస్ఐ గణేష్‌కుమార్ అన్నారు. ఉయ్యూరు పట్టణంలోని పలు కూడళ్లలో శుక్రవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ద్విచక్ర వాహనాలు నడుపుతున్న మైనర్లను గుర్తించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్ఐ గణేష్‌కుమార్ మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడపటం చట్టరీత్యా నేరమన్నారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇచ్చి బయటకు పంపవద్దన్నారు. ద్విచక్ర వాహనాలు నడుపుతూ మైనర్లు పట్టుబడితే తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తామన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

చెడుదారిలో నడిస్తే జీవితాలు దుర్భరం

కంకిపాడు: వ్యసనాలకు బానిసలై చెడు దారిలో నడిస్తే జీవితాలు దుర్భరంగా మారుతాయని ఎస్ఐ డి.సందీప్ అన్నారు. కంకిపాడు బస్టాండు, పలు కళాశాలలు, విద్యాసంస్థల వద్ద ప్రజలకు ఇబ్బంది కలిగించేలా ప్రవర్తిస్తున్న ఆకతాయిలకు శుక్రవారం పోలీసుస్టేషన్ ప్రాంగణంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. సందీప్ మాట్లాడుతూ ఆకతాయిగా మారి, అసాంఘిక చర్యలకు పాల్పడితే చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. కంకిపాడు పరిసరాల్లో గంజాయి విక్రయాలపై దృష్టి సారించామన్నారు. నిఘాను పటిష్టం చేశామన్నారు. గంజాయి విక్రయాలకు పాల్పడినా, గంజాయి తాగినా చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.



కంకిపాడు పోలీసుస్టేషన్‌లో యువతకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ డి.సందీప్

నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

గన్నవరం రూరల్: పదో తరగతిలో విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని ఎంఈవో కొండా రవికుమార్ అన్నారు. మండలంలోని సూరంపల్లి జెడ్పీ హైస్కూల్‌ను ఆయన శుక్రవారం సందర్శించి, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. 10వ తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేందుకు చర్యలు సూచించారు. వెనుకబడిన విద్యార్థులకు మెరుగైన బోధన చేయాలన్నారు. వారి తల్లిదండ్రులతో మాట్లాడి అవగాహన పెంచాలన్నారు. పరీక్షల కోసం ప్రభుత్వం అందజేసిన స్టడీ మెటీరియల్‌ను నిరంతరం చదివించాలని చెప్పారు. తరగతి గదిలో విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలించి మరింత దృష్టి పెట్టాలన్నారు. ఎంఈవో-2 కమల, సీఆర్‌పీ బడుగు దుర్గాదేవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈవో రవికుమార్

డ్రైవర్లకు వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

గన్నవరం: వ్యక్తిగత ఆరోగ్యంపై డ్రైవర్లు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని విజయవాడ ఉపరవాణా శాఖ అధికారి ఎం.పురేంద్ర సూచించారు. స్థానిక వాహన పటుత్వ పరీక్ష కేంద్రంలో శుక్రవారం రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. తొలుత ఈ వైద్య శిబిరాన్ని డీటీసీ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ప్రమాదాల నివారణ కోసం డ్రైవర్లు రోడ్డు భద్రత నిబంధనలను తప్పకుండా పాటించాలని చెప్పారు. అలసట, నిద్ర వచ్చినప్పుడు వాహనాలను నిర్ణీత పార్కింగ్ ప్రదేశాల్లో నిలిపి విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా డ్రైవర్లు ఆరోగ్య పరిరక్షణ కోసం హెల్త్ చెకప్‌లు చేయించుకోవాలని తెలిపారు. తద్వారా అనారోగ్య సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చన్నారు. అనంతరం వరుణ్ హెల్త్ సెంటర్ (నవరత్నం కేశవరావు చారిటబుల్ ట్రస్టు), సంధ్య ఐ హాస్పటల్ వైద్యులు నేతృత్వంలో సుమారు 150 మంది డ్రైవర్లకు బీపీ, షుగర్, జనరల్, కంటి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కేంద్రం ఇన్‌చార్జి ఆర్.ప్రవీణ్, ఎంవీఐలు జీవీఎస్ఎన్.మూర్తి, శివరామ్‌గౌడ్, ఉదయ్, డీవీ.రమణ, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీటీసీ పురేంద్ర

భక్తిశ్రద్ధలతో రథసప్తమి వేడుకలు

పెనమలూరు: పోరంకిలో శుక్రవారం రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో అత్యంత పురాతనమైన దేవాలయమైన శ్రీ ఆంజనేయ భవానీశంకర సూర్యనారాయణస్వామివారి దేవస్థానంలో రథసప్తమి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో ఉదయం 3 గంటలకు సుప్రభాతసేవ, స్వామివారికి పంచామృతాభిషేకం, విశేష అలంకరణ చేశారు. భక్తులు ఉదయాన్నే ఆలయానికి పెద్ద సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. కాగా ఉదయం 11 గంటలకు ఉషా ఛాయా సమేత సూర్యనారాయణస్వామివారికి దివ్య కల్యాణం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి కల్యాణం తిలకించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



స్వామివారిని దర్శించుకోవటానికి వచ్చిన భక్తులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ పరమేశ్వరరావు శుక్రవారం తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు, నూతన స్తంభాల ఏర్పాటు నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. గ్రామంలోని పటేల్‌నగర్, సాయి నగర్, హనుమాన్‌నగర్, టెంపుల్ ఏరియా, ఫ్లైఓవర్ దిగువ ప్రాంతం, రైల్వే స్టేషన్ కట్ట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. ఆయన శుక్రవారం వివరాలు వెల్లడించారు. గ్రామంలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. ఈ కారణంగా గ్రామంలో యనమలకుదురు, అవనిగడ్డ కరకట్ట, లంబాడీపేట, పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. స్థానికులు తమ సిబ్బందికి సహకరించాలని కోరారు.

గన్నవరం రూరల్: విద్యుత్ లైన్‌ల మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ పి.హరిబాబు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. మండలంలోని కొండపావులూరు, పురుషోత్తపట్నం, గోపవరపుగూడెం, కట్టుబడిపాలెం, ముదిరాజుపాలెం, వెంకట నరసింహపురం ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తామని, గృహ, వ్యవసాయ, వ్యాపార, పరిశ్రమల వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీ సీపీడీసీఎల్ గుడివాడ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.రామకృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హనుమాన్‌జంక్షన్ సెక్షన్ పరిధిలోని కృష్ణా నగర్, ఐటీఐ రోడ్డు, మహాత్మగాంధీ నగర్, రైల్వే స్టేషన్, ఇందిరా నగర్, గుడివాడ రోడ్డు, బీసీ కాలనీ ఏరియాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

రైతుల ఉద్యమానికి మద్దతు ఇవ్వాలి

పెనమలూరు: రైతుల ఉద్యమానికి అన్ని వర్గాల వారు మద్దతు ఇవ్వాలని జిల్లా రైతు సంఘ కార్యదర్శి వెలగపూడి అజాద్ అన్నారు. దేశవ్యాప్తంగా రైతులు చేస్తున్న ఆందోళనకు సంఘీభావంగా పోరంకిలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. అజాద్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం రైతులకు, కార్మికులను మోసం చేసిందన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తానని ఇవ్వలేదని, పోలవరం ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేయలేదని, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరణ చేసే కుట్రలో ఉందని ఆరోపించారు. మోడీని వచ్చే ఎన్నికల్లో ఇంటికి పంపాలని అన్నారు. సీపీఎం నేత ఉప్పాడ త్రిమూర్తి మాట్లాడుతూ ఢిల్లీలో జరుగుతున్న రైతుల ఉద్యమానికి అన్ని వర్గాల వారు మద్దతు పలకాన్నారు. ఈ కార్యక్రమంలో పలు పార్టీల నేతలు ఎస్‌కె.కాశిం, మున్నంగి నరసింహారావు, కిలారు వెంకటరత్నం, అరికట్ల నరేష్, మాదునాగేశ్వరరావు, వెలిసిల సుబ్రహ్మణ్యం, లక్ష్మీప్రసన్న, పలువురు పాల్గొన్నారు.

గన్నవరం: పంటలకు మద్దతు ధర కల్పించేందుకు స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలు చేయాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీ ఈశ్వరయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశవ్యాప్త గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెకు మద్దతుగా శుక్రవారం వామపక్షాల ఆధ్వర్యంలో పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ..న్యాయమైన డిమాండ్ల సాధన కోసం దేశ రాజధాని ఢిల్లీలో ఆందోళనకు సిద్ధమైన రైతులపై కేంద్ర ప్రభుత్వం అణచివేతకు పాల్పడడం దారుణమన్నారు. ఇప్పటికైన కేంద్ర ప్రభుత్వం రైతులతో చర్చలు జరిపి సమస్యలు పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతు, కార్మిక సంఘాల నేతలు కళ్ళం వెంకటేశ్వరరావు, పెద్దు వాసుదేవరావు, మల్లంపల్లి జయమ్మ, శనగల సుబ్బారెడ్డి, కాట్రగడ్డ రామచంద్రజోషి, సూరగాని సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

కంకిపాడు: ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలని ఏపీ కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.రంగారావు, సీఐటీయూ మండల కార్యదర్శి తాడంకి నరేష్ పిలుపునిచ్చారు. దేశవ్యాప్త కార్మికుల సమ్మె గ్రామీణ భారత్ బంద్ కార్యక్రమం శుక్రవారం కంకిపాడులో నిర్వహించారు. రైతు సంఘం ఆధ్వర్యంలో కంకిపాడు ప్రధాన సెంటరులో రైతులు నిరసన వ్యక్తం చేశారు. ప్రజాసంఘాల బాధ్యులు జె.రవి, ఎం.చంటి, పి.దుర్గారావు, వై.జోజి, కె.మురళి, వేమూరి నాగేశ్వరరావు, కె.నాంచారయ్య, పి.నాగేశ్వరరావు, సత్యవతి, సాంబయ్య పాల్గొన్నారు.



పోరంకిలో ర్యాలీ చేస్తున్న వామపక్ష నేతలు

8న మాదిగ మహిళాసదస్సు



గన్నవరం: విజయవాడలోని జింఖానా గ్రౌండ్స్‌లో మార్చి 8వ తేదీన అరుంధతి మాదిగ మహిళా సదస్సును జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య పిలుపు ఇచ్చారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శుక్రవారం మహిళా సదస్సు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ..సమాజంలో మాదిగ మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాల నియంత్రణకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సదస్సుకు మాదిగ మహిళా ప్రజాప్రతినిధులు, మేధావులు, ఉద్యోగులు తరలి రావాలని కోరారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాచేటి మురళీ అధ్యక్షతన ఉంగుటూరు ఎంపీపీ వడ్లమూడి సరోజిని, సర్పంచ్‌లు నిడమర్తి సౌజన్య, లాం దిబోరా, లాం నాగేశ్వరరావు, పలువురు సంఘ నేతలు పాల్గొన్నారు.